## నేడే ఉమ్మడి గురుకులాల 5వ తరగతి ప్రవేశ పరీక్ష

**మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 22 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 23వ తేదీన ఉమ్మడి గురుకులాల ప్రవేశ పరీక్ష 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా సమన్వయ అధికారి పి. వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులందరూ హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు సకాలంలో హాజరు కావాలన్నారు. పరీక్ష హాల్‌కు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింటు పెన్, ఎగ్జామ్ ప్యాడ్, హాల్ టికెట్ మాత్రమే తెచ్చుకోవాలని, పరీక్ష హాల్‌కు గంట ముందే అనుమతించబడునని తెలిపారు. కావున తల్లిదండ్రులు సురక్షితంగా తమ పిల్లలను సెంటర్‌కు సమయానికి తీసుకొచ్చి పరీక్ష వ్రాయించి తీసుకెళ్లాలన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల, మెదక్, రామాయంపేట, కొల్చారం కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష వ్రాయనున్నట్లు, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

# వార్త

## 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మె

-విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్-82) పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షులు రఘు, కార్యదర్శి మౌలానా

**పటాన్‌చెరు, ఏప్రిల్22 (ప్రభాతవార్త):** ఈ నెల 25వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేయడానికి విద్యుత్ యాజమాన్యానికి సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగిందని, తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్-82) పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షులు రఘు, కార్యదర్శి మౌలానాలు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లపై చర్చ జరపకుండా ఆర్టిజన్స్, నాయకులపై ఎస్మా అరెస్టుల కేసులు పెట్టడం వరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే తమ న్యాయమైన డిమాండ్లపై చర్చ జరిపేంత వరకు ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. 23 వేల మంది కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్న వారిని విచ్ఛిన్నం చేయడానికి భయాందోళనలకు గురిచేయడం సరికాదన్నారు. సమ్మె మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని వారు తెలిపారు.



మాట్లాడుతున్న ఈసీసీ సభ్యులు

### అంగన్‌వాడీని సందర్శించిన

## అభివృద్ధి పరిశీలన కమిటీ

**గజ్వేల్, ఏప్రిల్ 22 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్లలో ఆన్యువల్ డే, పిల్లల పరిశీలన అభివృద్ధి ఈసీసీ అసైన్‌మెంట్ జరిగింది. ఒకటి నుండి 5 సంవత్సరాల పిల్లలకు అసైన్మెంట్ కార్డ్స్ ఇచ్చి రిజిస్టర్ చేయించారు. పిల్లల మైండ్ మెచ్యూరిటీ ఎలా ఉంటుంది, వారు ఏ విధంగా చదువుతున్నారు, వారి పెరుగుదల ఏ విధంగా ఉంటుందనేది, వారి చేతి వేళ్ళు చిన్న, పెద్ద కండరాళ్ళు, శారీరకంగా సామూహిక వ్యక్తిగత భావోద్వేయంగా మేధావికాసం భాష నేర్చుకునే రీతులు బడికి సంసిద్ధత అనే అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి బూర్గుపల్లి రాజిరెడ్డి, ఏఎన్ఎం అనిత, స్నేహ, కార్యదర్శి రూప, అంగన్‌వాడీ టీచర్లు అనిత, సునీత, జయమ్మ, ఏడబ్ల్యూహెచ్ఐ రాజమ్మ, రాజేశ్వరి, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ధరిత్రి దినోత్సవం



న్యూస్‌పేపర్‌తో తయారుచేసిన పెన్నులను చూపుతున్న విద్యార్థులు

**ములుగు, ఏప్రిల్ 22 (ప్రభాతవార్త):** ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని అటవీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్ఎస్. శ్రీనిధి పేర్కొన్నారు. శనివారం ములుగు మండల కేంద్రంలోని అటవీ కళాశాల మరియు పరిశోధన సంస్థ (ఎఫ్‌సిఆర్ఐ)లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పక్షుల కోసం కళాశాల ఆవరణలో నీటి తొట్లను ఏర్పాటు చేయడంతో పాటు వ్యర్థాల నిర్వహణలో 4ఆర్ రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్, రికవరీ ఫార్ములా ఆవశ్యకతను తెలియజేసేలా, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి వాడేసిన చెత్త కాగితాలు, పాత న్యూస్ పేపర్‌తో పెన్నులను తయారుచేసి విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి ఉచితంగా అందజేశారు. అనంతరం ఎన్ఎస్.శ్రీనిధి మాట్లాడుతూ రోజురోజుకీ మానవ కార్యకలాపాల వల్ల పర్యావరణం కాలుష్యం అవుతుందని, ప్రణాళిక బద్ధంగా లేని పారిశ్రామీకరణ, నగరీకరణ వల్ల నేల, నీరు, గాలి కాలుష్యం బారిన పడుతున్నాయన్నారు. జీవ వైవిధ్యం అంతరించిపోతుందని, కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం వల్ల గ్లోబల్ వార్మింగ్ అవుతుందని, భూతాపం పెరిగిపోతుందని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ముమ్ముందు ధరిత్రి నిప్పుల కుంపటిగా మారే ప్రమాదం ఉందన్నారు. మానవ మనుగడ సజావుగా సాగాలంటే ధరిత్రిని కాపాడుకోవడం ఒక్కటే మార్గం అన్నారు.

## రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మెదక్ పట్టణంలోని నవాబుపేట ఈద్గా వద్ద ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలరోజులుగా భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో ఉపవాస దీక్షలు చేపట్టి రంజాన్ మాసం నేటి చివరి రోజు ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఈద్గాలో ఏర్పాటు చేసిన రంజాన్ పండుగ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గడ్, కౌన్సిలర్లు సమీయొద్దీన్, కృష్ణారెడ్డి, నర్వ లక్ష్మీనారాయణగౌడ్, వసంత్‌రాజ్, జయరాజ్, భీమరి కిషోర్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఉమర్, ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ పురం వెంకటనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేడిశెట్టి శంకర్, నాయకులు రాగి అశోక్, లింగారెడ్డి, ముత్యంగౌడ్, బొద్దల కృష్ణ, శివరామకృష్ణ, కొండ శ్రీనివాస్, జుబేర్ అహ్మద్, మమమ్మద్ ఉమర్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీల సంక్షేమానికి కొత్త పథకాలు

### మంత్రి కొప్పుల ఈశ్వర్

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** సిఎం కెసిఆర్ ఎస్సీల సంక్షేమానికి అనేక కొత్త పథకాలను అమలు చేస్తున్నారని ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విపంచి అడిటోరియంలో శనివారం 300 మంది ఎస్సీ కులాల లబ్ది దారులకు మంత్రి హరీష్‌రావుతోకలిసి ఆయన చెక్కుల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మీ పథకం ఎస్సీలతోనే ప్రారంభించడం జరిగిందన్నారు. దళితబంధు పథకంతో దేశమే ఆశ్చర్యపోతుందన్నారు. ఈనెల 30న రాష్ట్ర రాజధాని హైదారాబాద్‌లో డాక్టర్ బి.అర్.అంబేద్కర్ సెక్రటేరియట్ సిఎం కెసిఆర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. సిఎం కెసిఆర్ సంక్షేమం, అభివృద్ధితో పాటు దళిత జాతి అభివృద్ధికి పాటు పడుతున్నారని తెలిపారు. మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో 1100 మంది దళిత కుటుంబాలకు దళితబంధు పథకం అందజేయడం జరుగుతుందన్నారు. దళితుల కుటుంబాలలో వెలుగులు నింపడానికే సిఎం కెసిఆర్ దళితబంధు పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ డాక్టర్ పి.శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లో

# రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలి

### ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనమని.. నూకలు బుక్కమని రాష్ట్ర ప్రజలను అవహేళన చేసి కారడ్డమాడిందని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని వెల్కటూర్ గ్రామంలో శనివారం జిల్లాలోనే మొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఏ రోజు ధాన్యం ఆ రోజే కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. అత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.5 లక్షల రైతు బీమా పథకం చెక్కు అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



వెల్కటూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేటలో తొలి గృహలక్ష్మీ బుడగ జంగాలకే**

ప్రజా అవసరాలకు అనుగుణంగా బిఆర్ఎస్ ప్రభుత్వం కృషిచేస్తుందని..సిద్దిపేటలో తొలి గృహలక్ష్మీ బుడగ జంగాలకే అందిస్తామని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపుకార్యాలయంలో శనివారం బేడ, బుడగ జంగాల అర్హులైన లబ్దిదారులు 86 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. సిద్దిపేటలో పేదలకు అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఖాళీ స్థలం ఉన్న నిరుపేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ. 3లక్షల అర్థిక సహాయం అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటే గల్లీ మొత్తం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ విజతవేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, కౌన్సిలర్ బర్ల మల్లికార్జున్, తహశీల్దార్ విజయ సాయి తదితరులు పాల్గొన్నారు.

**బిజెపి నుంచి బిఆర్ఎస్‌లో చేరిక**

చిన్నకోడూరు మండలపరిధిలోని గోనెపల్లి బిజెపికి చెందిన 20 యువకులు మంత్రి తన్నీరు హరీష్‌రావు సమక్షంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన యువకులకు బిఆర్ఆర్ కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కూర మాణిక్యరెడ్డి, వైస్ ఎంపిపి కీసర పాపయ్య, బిఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి వేలేటీ రాధాకృష్ణశర్మ, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, పార్టీ నాయకులు తాళ్లపల్లి ఎల్లయ్య, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బిపిపికి రాజీనామా చేసి బిఆర్ఎస్‌లో చేరిన వారిలో శ్రీకాంత్, మహేష్, రవి, కుమార్, మున్నీ, అశోక్, అంజిరెడ్డి, అజయ్ ఉన్నారు.



కుమ్మరిపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం ఎప్పుడో ?

**చిన్నశంకరంపేట,ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు నిండిపోయాయి. కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారని అన్నధాతలు ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు అకాల వర్షం కురవడంతో ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధి మదూర్,గజగట్లపల్లి, చెన్నాయిపల్లి, ఖాజాపూర్, శాలీపేట తదితర గ్రామాలలో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలోగా పండించిన పంట వర్షార్పణం అయ్యేలా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం రాత్రి శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి మామిడి తోట రైతులకు కన్నీటిని మిగిల్చింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి మామిడి కాయలు రాలి తీవ్ర నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఉంటే వర్షానికి ధాన్యం తడిసేది కాదని రైతులు తెలిపారు.ఇప్పటికైన అధికారులు గ్రామాలలో పర్యటించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చూడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



వర్షానికి రాలిన మామిడి కాయలు



కుంభమేళ పనులను పరిశీలిస్తున్న డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్

## కుంభమేళ పనులను పరిశీలించిన డిసిఎంఎస్ చైర్మన్

**న్యాల్‌కల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఈ నెల 24వ తారీఖు నుంచి 12 రోజుల పాటు కొనసాగే మంజీరా కుంభ మేళ కోసం ఏర్పాటు చేస్తున్న పనులను శనివారం డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మున్నూర్ రవీందర్, హద్నూర్ సొసైటీ డైరెక్టర్ యంఆర్ ప్రవీణ్‌కుమార్, బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీసు, రెవిన్యూ తదితర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. కుంభమేళకు సాధువులు,సంతులు, అఘోరాలు, ఆయా పీఠాధిపతులు, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నందున వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా తగు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్‌కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించిన విషయం పాఠకులకు విధితమే. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా శాఖల అధికారులు మంజీరా తీరంలో పనలు పనులు నిర్వహిస్తున్నారు.

**కుంభమేళకు అదనపు బస్సు ట్రిప్పులు...**

ఈ నెల 24వ తారీఖు నుంచి ప్రారంభం కానున్న మంజీర కుంభమేళ కార్యక్రమాలను పురస్కరించుకుని ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఉండేందుకు నారాయణఖేడ్ డిపో నుంచి జహీరాబాద్ వెళ్లే బస్సు ట్రిప్పులను పెంచినట్లు డిపో మేనేజర్ మల్లేశయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారాయణఖేడ్ డిపో నుంచి జహీరాబాద్‌కు నిత్యం 12 ట్రిప్పులు నడుస్తుండగా కుంభమేళను పురస్కరించుకుని నిత్యం 18 ట్రిప్పులు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. నారాయణఖేడ్ నుంచి రాఘవాపూర్ మీదుగా కర్ణాటకలోని బీదర్ పట్టణానికి నిత్యం 9 ట్రిప్పులు నడుస్తుండగా కుంభమేళ కోసం నిత్యం 12 ట్రిప్పులను బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ మల్లేశయ్య వివరించారు.

# సిద్దిపేట జిల్లాలో ఘనంగా రంజాన్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలోని ఆయాగ్రామాల్లో, పట్టణాల్లో ముస్లింలు శనివారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల్లో, మసీదుల్లో ప్రార్థనలుచేసి రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ పండగ పురస్కరించుకొని మసీదులు రంగు, రంగు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. పట్టణంలో ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి సాజిద్‌పూర, ఎక్బాల్‌మినార్,కమాన్‌రోడ్డు, చర్వాదాన్ వీధుల్లోని మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం కులమతాలకు అతీతంగా ఒకరికొకరు ఆలింగనంచేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మెదక్ రోడ్డులోని ఎక్బాల్ మినార్ మసీదు వద్ద మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు పాల సాయిరాం,మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ నాగరాజురెడ్డి, కలకుంట్ల మల్లికార్జున్,బర్ల మల్లికార్జున్, నాయకం లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు గంప మహేందర్ రావు, ముస్లింలను ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

**ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** సిఎం కెసిఆర్ పాలనలో 9 ఏళ్ల నుంచి అన్ని వర్గాల ప్రజలు పండుగలను అన్నదమ్ముల వలే ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలో మెదక్ రోడ్డులోగల ఈద్గా వద్ద ఆయన ముస్లింలకు శనివారం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు భక్తి శ్రద్దలతో రంజాన్ పండుగ జరుపుకున్నారన్నారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముస్లింలకు టిఆర్ఎస్ సర్కారు అనేక సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ముస్లింలను అలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితరులు మాట్లాడారు.అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు ముస్లింలను ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.





సిద్దిపేట మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి తన్నీరు హరీష్‌రావు



మాట్లాడుతున్న ఏసీపీ దేవరెడ్డి

## బెదిరింపు కేసులో ఐదుగురు అరెస్ట్

### ఎసిపి దేవరెడ్డి

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని వేములవాడ కమాన్ సమీపంలో గల ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ అఫీస్‌పై దాడిచేసిన నిందితులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ చల్లా దేవరెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో టూ టౌన్ సీఐ రవికుమార్‌తో కలిసి విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం చక్రధర్‌గౌడ్‌కు చెందిన ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ అఫీస్‌పై గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌లపై వచ్చి దాడి చేసి వాచ్‌మెన్ చంపుతామని బెదిరించడంతోపాటు అఫీస్‌ను దగ్ధం చేస్తామని హెచ్చరించినట్లు తెలిపారు. దీంతో బాధితుడు వాచ్‌మెన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ అమర్ కేసు నమోదు చేయగా సీఐ రవికుమార్ విచారణ చేపట్టి నిజానిజాలు బయటపడ్డాయన్నారు. సిద్దిపేట పట్టణానికి చెందిన బిజెపి సానుభూతిపరులు కొట్టే నరేందర్ అలియస్ చందు, వర్కోలు విజయ్, భువనగిరి హరీష్, అధిత్యరాం, బండి హర్షవర్ధన్‌లు పథకం ప్రకారమే రెండు బైక్‌లపై వచ్చి గొడవచేశారని తెలిపారు. సీసీ ఫుటేజీ లను పరిశీలించి బైక్ నంబర్ల ద్వారా నిందితులను పట్టుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఐదుగురు నిందితులు బిజెపి సానుభూతి పరులే నని తెలిపారు. చక్రధర్‌గౌడ్ బిజెపిలో చేరిన నాటి నుంచి పార్టీ కార్యకర్త లను, సానుభూతి పరులను పట్టించుకోవడం లేదన్న అగ్రహంతోనే ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ కార్యాలయంపై దాడి చేసినట్లు నిందితులు అంగీకరించినట్లు ఏసీపీ వివరించారు. సోషల్ మీడియాలో అసత్యపు అరోపణలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేయకుండా సమన్వయం పాటించాలన్నారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని మరోసారి హెచ్చరించారు. సోషల్ మీడియాలో చిన్నతప్పు చేసిన చర్యలు తప్పవన్నారు.

## అత్తింటి ఆరళ్లకు వివాహిత బలి

**పాపన్నపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** అత్తింటి ఆరళ్లకు అబల బలైన సంఘటన మండల పరిధిలోని చీకోడ్ గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బోయిని సంగమేశ్వర్‌కు కొంపల్లి గ్రామానికి చెందిన శ్రీలతతో కొన్ని సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. సంసార జీవితంలో ఇరువురికి జన్మనిచ్చారు. కొన్ని రోజులుగా భర్త సంగమేశ్వర్ అత్త అనసూయ, మరిది సాయిబాబా అదనపు కట్నం కోసం శ్రీలతను వేధించడం ప్రారంభించారు. గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ జరిగినా అత్తింటివారిలో మార్పు రాకపోగా ఈ నెల 20న రూ. 4 లక్షల తేవాలని శ్రీలతను మానసికంగా శారీరకంగా వేధించడంతో విషయాన్ని శ్రీలత తండ్రి గోపాల్‌కు తెలిపింది. దీంతో గోపాల్ చీకోడ్ చేరుకుని అల్లుడిని సముదాయించిన ప్రయోజనం లేకపోవడంతో కూతురిని స్వగ్రామానికి తీసుకుకెళతానని అల్లుడికి నచ్చ చెప్పినా పంపేది లేదని చెప్పడంతో శ్రీలత జీవితంపై విరక్తి పెంచుకుని శనివారం శ్రీలత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. కూతురు శ్రీలత అదనపు కట్నం కోసం వేదించడంతోనే ఆత్మహత్య చేసుకుందిని, ఇది అత్తింటి హత్యే అని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ వివరించారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

**పాపన్నపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అర్కెల గ్రామ శివారులోని చెరువులో శనివారం జరిగింది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... రాజ్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని దూమ్లాతండాకు చెందిన ధరావత్ రవి(28) వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడన్నారు.కొంత కాలంగా మద్యానికి బానిసై శుక్రవారం అతిగా మద్యం తాగి ఇంటికి చేరుకోవడంతో భార్య లలిత ధరావత్ రవిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రాత్రికి భోజనం చేసి ఇదిగో వస్తానని చెప్పి వెళ్లిన ధరావత్ రవి రాత్రికి ఎంతకూ ఇంటికి చేరుకోలేదన్నారు. శనివారం ఉదయం అర్కెల గ్రామ శివారులోని చెరువులోని తూము వద్ద రవి బైక్, చెప్పులు ఉన్నాయని అటుగా వెళ్లిన వారు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారన్నారు. భర్త మృతిపై అనుమానం ఉందని భార్య లలిత ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టంకై తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## మహిళ నుంచి పుస్తెల తాడు చోరీకి యత్నం

### నిందితుడిని పట్టించిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

**నర్సాపూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఆటోలో ప్రయాణిస్తున్న మహిళపై కత్తితో బెదిరంచి పుస్తెల తాడును తెంపేందుకు యత్నిస్తుండగా ఆ మహిళ గట్టిగా అరవడంతో అటే వెళుతున్న రాష్ట్ర మహిళా కయొషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అరుపులు విని కాన్వాయ్‌ని ఆపి దొంగని పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి కళాశాల వద్ద శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం... సంగారెడ్డి జిల్లా జోగిపేట సమీపంలోని సంగుపేటకు చెందిన ఊరడి సురేశ్ సొంత ఆటోలో భార్య స్వప్నతో కలిసి నర్సాపూర్ వస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇస్మాయిల్‌ఖాన్ పేట వద్ద అమృత వీరి ఆటోలో ఎక్కిందని తెలిపారు. ఆటో ఆవంచ గ్రామ స్టేజీ వద్దకు రాగానే డ్రైవర్ సురేశ్ కత్తి తీసి అమృతపై కత్తి చూపి భయపెట్టి పుస్తెల తాడును తెంపుకొని చోరికి పాల్పడగా ఇదే దారిలో వెళుతున్న రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి మహిళా అరుపులు విని తన కాన్వాయ్ ను ఆపి వివరాలు తెలుసుకొని పుస్తెల తాడును తెంపుకొని పరారవుతున్న ఆటో డ్రైకర్ సురేశ్‌ను ఆమె భద్రత సిబ్బంది పట్టుకున్నారు. ఈ విషయాన్ని నర్సాపూర్ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందంచి పుస్తెల తాడు దొంగలించే యత్నం చేసిన ఆటో డ్రైవర్ సురేశ్ ను అతని భార్య స్వప్నను పోలీస్ స్టేషన్ కు అప్పగించారు. వివరాలన్ని తెలుసుకన్న ఎస్ఐ శివకుమార్ వస్తువును స్వాదీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.





నిందితుడు సురేశ్, బాధితురాలిని ఓదారుస్తున్న సునీతారెడ్డి

# ఘనంగా ఈద్-ఉల్ ఫితర్


ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు

## ఘనంగా రంజాన్ పండుగ సంబరాలు

**కౌడిపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా శనివారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే నూతన వస్త్రాలను ధరించి శిర్‌కర్మ పాయసం, చికెన్ బిర్యాని తదితరాలు తయారుచేసి, వారి పూర్వీకులకు, ప్రవక్తకు నైవేద్యాలను సమర్పించి, పండుగ ఉత్సవాలను అత్యాంత్య వైభవంగా జరుపుకున్నారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సార రామగౌడ్, యూత్ అధ్యక్షుడు చంద్రం క్రిష్ణాగౌడ్, ఎంపిపి రాజునాయక్, తదితరులు ఈద్గవద్దకు వెళ్లి ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండల కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ హైమద్ గృహల్లో ఏర్పాటు చేసిన విందు భోజనానికి బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్‌నగర్ సొసైటీ వైస్ చైర్మన్ చిలుముల చిన్న చిన్నంరెడ్డి, అమర్ సింగ్‌నాయక్, ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి కౌడ శ్రీనివాస్‌గుప్తా, మత పెద్దలు మహమ్మద్ రసూల్, ఉస్మాన్, పాషా, అన్వర్, మీనాజోద్దీన్, ముజాసింగ్, అక్బర్, కౌడిపల్లి గ్రామ వార్డు సభ్యులు తిరుమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

**కొల్చారం మండలంలో...**


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

**కొల్చారం, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** శనివారం కొల్చారం మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కొల్చారంతోపాటు రంగంపేట ఈద్గాల వద్ద, వరిగుంతం మస్జీద్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు గ్రామంలోని పురవీధులగుండా ముస్లింలు ర్యాలీగా ఈద్గాల వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మత గురువు ఇసాక్ రంజాన్ ప్రాముఖ్యతను వివరిస్తూ శాంతి సందేశాన్ని ఇచ్చారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనంచేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రసిద్ధ షేక్ షాబోద్దీన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఇమామ్ ఇసాక్, అరిఫోద్దీన్, సాధక్ అలీ, ఖదీర్, మున్వార్ అలీ, మున్ను, అక్రమ్, షరీఫ్, హైమదర్, అర్షద్, ఆయుబ్, వార్డు సభ్యులు మహమ్మద్, ఖాలీమ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు. ఫోటో3: ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

**అల్లాదుర్గంలో...**

**అల్లాదుర్గం, ఏప్రిల్22 ప్రభాతవార్త:** మండలంలోని గడి పెద్దాపూర్, ముస్లాపూర్, చిల్వర్, మాందాపూర్, ముప్పారం, చేవెళ్ల తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అల్లాదుర్గంలోని నమోజ్ బొగుడ ఈద్గా వద్ద ముస్లింలు ఉదయాన్నే డప్పు వాయిద్యాలతో ఈద్గా వద్దకు చేరుకొని అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే గడి పెద్దాపూర్‌లో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో మండల మాజీ కోఆప్షన్ సభ్యులు అలీ హుస్సేన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైందని, నిష్ఠతో పాటించి ఉపవాస దీక్షలు దైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి, సౌభ్రాతృతం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

**నర్సాపూర్ మండలంలో...**


ముస్లిం మత పెద్దల తో పాటు పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మండలంలో ముస్లింలు శనివారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నర్సాపూర్‌లోని నమాజ్ గడ్డ ప్రాంతంలోగల ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మదన్‌రెడ్డి, సునీతారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, నర్సాపూర్ మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, నాయకులు హబీబ్‌ఖాన్ పాల్గొన్నారు.

## కల్లు దుకాణంపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతూ గౌడ సంఘం నేతలు

**నర్సాపూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో కల్లు దుకాణంపై దాడిచేసి గీతా కార్మికులను కొట్టినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నూతన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్ గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆశన్నగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని గౌడ సంఘం భవనంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు మంచి కల్లును అందిస్తున్న గౌడ కార్మికులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఇప్పటికే గ్రామాల్లో విచ్చల విడిగా నడుస్తున్న బెల్టుషాపులతో గౌడ కులస్తుల కుటుంబాలు రోడ్డునపడుతున్నాయన్నారు. ఇకముందు గౌడ కార్మికుల జోలికి వస్తే ప్రతి దాడులు తప్పవని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నూతన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్‌గౌడ్, కల్లు గీతా కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆశన్నగౌడ్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, గీతా కార్మికులు రాజాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, అశోక్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, దేవాగౌడ్, రామాగౌడ్ పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంబించిన ఎంపి

**జహీరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడిని 890 జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలో రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానశిబిరాన్ని ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుఉ, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్‌లు ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామాల నుంచి యువకులు చేరుకుని రక్తాన్ని దానం చేశారు. రక్తదానం చేసిన దాతలకు అతిథులు ధృవపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రీయ బసవ దళ్ అధ్యక్షులు శంకర్‌పాటిల్, రాష్ట్రాయ బసవ దళన జహీరాబాద్ సమాజ్ అధ్యక్షులు డాక్టర్ శరణప్ప, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి వినయ్ పాటిల్, వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, లింగాయత్ సమాజ్, రాష్ట్రీయ బసవదళ్ నాయకులు పాల్గొన్నారు.


కంగ్టిలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


మనూర్‌లో...


పుల్కల్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


జహీరాబాద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**కంగ్టి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు తడ్కల్ తదితర గ్రామాల్లో శనివరం రంజాన్ పర్వ దినాన్ని మహ్మదీయులు ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్ద సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రమైన కంగ్టిలో ఇమామ్ నయ్యర్ ఆజం ఖురాన్ సూక్తులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరకు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ఉల్ ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు.

**మనూర్ మండలంలో...**

**మనూర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మనూర్‌తో పాటు మండలంలోని రాయిపల్లి, ఎల్గోయి, పుల్‌కుర్తి తదితర గ్రామాల్లో ఉదయం నూతన వస్త్రాలు ధరించి గ్రామాల శివారులోని ఈద్గాల వద్ద సామూహికంగా ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**పుల్కల్ మండలంలో...**

**పుల్కల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఈద్ ఉల్ ఫితర్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి గ్రామాల శివారులోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పుల్కల్‌తో పాటు సింగూరు, పెద్దారెడ్డిపేట, మంతూర్, ఇటిక్యాల్, ముదిమాణిక్యం, చౌటకూరు, శివంపేట, సుల్తాన్‌పూర్, కోర్పోల్, తాతనపల్లి, గంజోగిపేట తదితర గ్రామాల్లో ప్రజలు ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**పాపన్నపేట మండలంలో...**

**పాపన్నపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మండలంలో శనివారం ముస్లింలు రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. పాపన్నపేటతోపాటు ఆయా గ్రామాల్లో ఉదయం నూతన వస్త్రాలు ధరించి ఈద్గా వద్దకు చేసుకుని సామూహికంగా ప్రార్థనలు చేశారు. ఈ సంరద్భంగా కులమతాలకు అతీతంగా ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండగను ప్రశాంతంగా కొనసాగేలా ఎస్ఐ విజయ్‌కుమార్ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

**జహీరాబాద్ నియోజకవర్గంలో...**

**జహీరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో శనివారం రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా వద్దకు నూతన వస్త్రాలు ధరించి సామూహికంగా ప్రార్థనలు చేశారు. ఈ సందర్బంగా ఒకరిక ఒకరు ఆలింగనం చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**రంజాన్ వేడుకల్లో ఎంపి, ఎమ్మెల్యే...**

రంజాన్ వేడుకల్లో ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్‌లు పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రైల్వే బోర్డు సభ్యులు షేఖ్ ఫరీద్ నివాసానికి చేరుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపి తేనేటి విందులో పాల్గొన్నారు. మాజీ మంత్రి స్వర్గీయ మహ్మద్ ఫరీదుద్దీన్ నివాసానికి చేరుకుని రాష్ట్ర మైనార్టీ కార్పోరేషన్ సభ్యులు మహ్మద్ తన్వీర్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

**ముస్లింలకు ఢిల్లీ వసంత్ శుభాకాంక్షలు**

రంజాన్ పండగను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఈద్గా వద్ద సామాజిక ఉద్యమకారులు ఢిల్లీ వసంత్ తన బృందం సభ్యులతో చేరుకుని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ శివారులోని బీదర్ చౌరస్తా వద్ద అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఆదివారం విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడి 890వ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు బసవజయంతి శుభాకాంక్షలు తెలిపారు.


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపి, ఎమ్మెల్యే డిసిఎంఎస్ చైర్మన్

**కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు...**

పవిత్ర రంజాన్ పండగను పురష్కరించుకుని శనివారం కాంగ్రెస్ నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జేజే కన్‌స్ట్రక్షన్ అధినేత మీర్ జావిద్ అలీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హర్షద్ పటేల్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, నాయకులు కండెం నర్సింలు, పి నరసింహారెడ్డి, ఎండి ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

**ఝరాసంగంలో మండలంలో...**

**ఝరాసంగం, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పరోపకారానికి ప్రతీకంగా నిలిచే రంజాన్ పండగను పురష్కరించుకుని ముస్లింలు కొత్త వస్త్రాలు ధరించి గ్రామాల శివారులోని ఈద్గా వద్దకు చేరుకుని సామూహికంగా ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం కులుమాతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా పండగ శుభాకాంక్షలు తెలుపుకుని పండగను ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు.


ఝరాసంగంలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు


మహ్మద్ తన్వీర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

**తన్వీర్‌కు రంజాన్ శుభాకాంక్షలు**

**న్యాల్‌కల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మాజీ మంత్రి స్వర్గీయ మహ్మద్ ఫరీదుద్దీన్ తనయుడు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ సభ్యులు మహ్మద్ తన్వీర్‌ను బిఆర్ఎస్ నాయకులు రంజాన్‌పండగ శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని మహ్మద్ తన్వీర్ నివాసానికి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మున్నూర్ రవీందర్, ప్రధాన కార్యదర్శి మాతంశెట్టి రాజ్‌కుమార్, హద్నూర్ సొసైటీ డైరెక్టర్ ఎంఆర్ ప్రవీణ్‌కుమార్, అత్నూర్ మాజీ సర్పంచ్ సంగ్రామ్ పాటిల్ చేరుకుని రంజాన్ ముబారక్ తెలిపారు.


లాల్‌సింగ్ నాయక్ తండాలో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

## లాల్‌సింగ్ నాయక్ తండాలో సిసి రోడ్డు పనులు షురూ

**పుల్కల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మండలంలోని లాల్‌సింగ్ నాయక్ తండాలో సిసి రోడ్డు పనులను శనివారం షురూ చేశారు. ఎంజిఎన్ఆర్ఈజిఎస్ కింద మంజూరైన 5 లక్షల రూపాయలతో గ్రామంలో సిసి రోడ్డు పనులను పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గిరిధర్, బిఆర్ఎస్‌వి నాయకలు దినేష్ నాయక్, వార్డు సభ్యులు రాములు, నాయకులు రతన్ కీర్యా నాయక్, కిషన్, రాములు, హరిసింగ్, రమేష్, మేగరాజన, ఉదయ్, అనిల్, విక్రమ్, శ్రీను, పవన్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** గత కొన్ని రోజుల నుండి మన జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి జిల్లా ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదా మరణాలు ఎక్కువగా ద్విచక్ర వాహన ప్రమాదాల వలన జరుగుతున్నట్లు అందులోనూ ముఖ్యంగా హెల్మెంట్ ధరించకపోవగం వలన తలకు గాయాలు తగిలి చనిపోతూ వారి కుటుంబాలకు తీరని లోటు మిగులుతున్నాయని ఆవేదన వ్య క్తం చేశారు. దీని గురించి జిల్లా ఎస్పీ ప్రత్యేక శ్రద్ధ వహించి మొత్తం జిల్లాలో ఎన్ని ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. అందులో ఎంతమంది హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతన్నారు. అని ప్రతి పోలీస్ స్టేషన్ వారిగా వివరాలు సేకరించారు. ఇంటింటి సర్వే చేసి సేకరించిన సమాచారం ద్వారా జిల్లాలో సుమారు 40శాతం వరకు వాహనదారులకు హెల్మెట్ లేదని తెలిపినది. దీనిపై ఈ వారంలో అన్ని పోలీస్ స్టేషన్లలో హెల్మెట్‌పై అవగాహన కల్పించి, వచ్చే వారంలో హెల్మెట్ లేకుండా నడిపే వాహనదారులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. కావున ద్విచక్ర వాహనదారులు అందరూ హెల్మెట్ కలిగి ఉండాలని, అదేవిధంగా హెల్మెట్ కలిగి యున్న ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెంట్ ధరించి వాహనాలు నడిపి ప్రాణాలు కాపాడుకోవాలని తెలియజేశారు.

### ఘనంగా ఆంజనేయ స్వామి పల్లకి సేవ

**షాద్‌నగర్, ఏప్రిల్ 22, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాస్థానంలో శనివారం స్వామి వారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామి విగ్రహాన్ని ఊరేగిం పుగా నిర్వహించి ఆట పాటలతో, భక్తీ గీతాలు ఆలపిస్తూ భక్తులు పెద్ద ఎత్తున భజనలు చేశారు. అనంతరం ఆలయ ఆర్చకులు రఘుపతిరావు, ప్రమోద్, సునీల్ పంతులు ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న సంఘం నాయకులు

## 28న రెడ్ల సమ్మేళనం

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఈ నెల 28న మెదక్ పట్టణంలో శ్రీ వెంకటేశ్వర గార్డెన్‌లో నిర్వహించే రెడ్ల ఆత్మీయ సమ్మెళనంను ప్రతి ఒక్క రెడ్డిలు పాల్గొని విజయవంతం చేయాలని మండల రెడ్ల సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం భాగ్యనగరంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో మండల రెడ్ల సంఘం నాయకులు లక్ష్మారెడ్డి, బాగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేతకిలో కొనసాగుతున్న శ్రీశతచండీ మహాయాగం

**ఝరాసంగం, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయంలో శ్రీశతచండీ మహాయాగం పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో శుక్రవారం యాగం పూజలు ప్రారంభించిన విషయం పాఠకులకు విధితమే. పూజా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన శనివారం ఆలయంలో కేతకి సమేత పార్వతీ దేవి ఏకవార మహా రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌లు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శతచండీ యాగంలో భాగంగా శనివారం అవహిత దేవత పూజ, శ్రీ యంత్ర పూజ, చండి పారాయణం, మంగళహారతి, యోగిని బాలి నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాద విరతణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ నీల వెంకటేశం, ఆలయ ఇఓ శశిధర్, ఆలయ కమిటి బాధ్యులు జి నాగన్న, ఎంపి నాగన్న ముదిరాజ్, లక్ష్మయ్య, గ్రామ సర్పంచ్ జగదీశ్వర్, ఆలయ అర్చకులు, నీల కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


శ్రీచత చండీ మహాయాగం నిర్వహిస్తున్న దృశ్యం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

## 26న పూలే అంబేద్కర్ జనజాతర

**కంది, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఈ నెల 26న నిర్వహించే పూలే అంబేద్కర్ జన జాతరను జయప్రదం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కాశీపూర్ గ్రామంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు పి అశోక్ మాట్లాడుతూ 26న జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో మహాత్మా జ్యోతిరావు పూలే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జన జాతరను నిర్వహిస్తున్నట్లు, జాతరను విజయవంతం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. సంగారెడ్డిలోని ఐబి నుంచి డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వరకు నీలి దండు కవాతు నిర్వహిస్తామన్నారు. జాతరకు ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి కాశీం, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఉద్య గాయకురాలు స్వర్ణక్క, బహుజన వాగ్గేయకారులు మచ్చ దేవేందరన, డిక్కి సౌత్ ఇండియా ఉపాధ్యక్షులు చంటి రాహుల్ కిరణ్‌లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో జాతరను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కుమార్, నరేష్, నాగరాజ్, బాలరాజ్, భాస్కర్, ప్రవీణ్, నితిన్, ముగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## మోడీ, సంజయ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం


మోడీ, సంజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బిజెపి శ్రేణులు

**కొమురవెల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపి బండి సంజయ్ విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వీని వైష్ణవ్ కొమురవెల్లి పుణ్యక్షేత్రం వద్ద రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో బిజెపి శ్రేణులు శనివారం మండల కేంద్రంలోని కొమురవెల్లిలో ప్రధాని మోడీ, బండి సంజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం బండి సంజయ్ పేరు మీద అర్చన చేయించారు. మల్లికార్జున్ స్వామి అలయానికి లక్షలాది మంది ఇతర రాష్ట్రాల నుంచి పక్క జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని రైల్వేలైన్ స్టేజీ ఏర్పాటుతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బూరుగు సురేష్‌గౌడ్, కటకం అమరేందర్, శ్రీనివాస్‌యాదవ్, బైరి రాజేందర్ యాదవ్, గోనె భాస్కర్, బసరాజు నరేష్, ఎక్కలదేవి ప్రశాంత్ యాదవ్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

### వడగండ్ల వానతో మామిడి తోటలు, వరి పంటకు తీవ్ర నష్టం

**సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు/కొమురవెల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** జిల్లాలోని వివిధ మండలాలలో శనివారం సాయంత్రం కురిసిన రాళ్లవానతో మామిడి పంటలు నేల రాలగా వరి పంట నేలకొరిగింది. దీంతో వివిధ మండలాలల్లో మామిడి తోటలకు, వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది. కొమురవెల్లి మండల పరిధిలోని ఐనాపూర్, పోసాన్‌పల్లి, గురువన్నపేట, కొమురవెల్లి తదితర గ్రామాల్లో రాళ్లవానతో మామిడి తోటలకు, వరి పంటకు తీవ్ర నష్టం జరిగింది. మామిడి కాయలు నేల రాలిపోయాయి. చేతికి అందిన పంట కళ్ల ముందు నేల రాలడంతో రైతులు తీవ్ర అవేదనకు గురవుతున్నారు. అలాగే చిన్నకోడూరు మండల పరిధిలోని గంగాపూర్‌లో కురిసిన వడగండ్ల వానతో 500 ఎకరాల వరి పంటకు నష్టం జరిగినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. అలాగే మామిడి తోటలకు సైతం నష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులను అదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చల్లార తిరుపతిరెడ్డి, గంగాపూర్ గ్రామ కమిటీ నాయకులు జగన్‌రెడ్డి, పిట్ల నర్సయ్య, కొండి రాజిరెడ్డి, పిట్ల తిరుపతి, నవీన్‌లు కోరారు. అలాగే జిల్లాలోని వివిధ మండలాల్లో కురిసిన వడగండ్ల వానతో వరి మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.


రాలిన మామిడి కాయలు, కురిసన రాళ్ల వాన

# గరుడ గంగ మంజీరా నది పుష్కరస్నానాలు ప్రారంభం

**మెదక్ రూరల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మెదక్ మండలం పేరూర్ గ్రామంలో శ్రీసరస్వతి విద్యా పీఠం వద్ద నిర్వహిస్తున్న మంజీరా గరుడ గంగా పుష్కర కార్యక్రమం కుటుంబ సమేతంగా సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి హజరై పుష్కర స్నానాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమెల్సి శేరి సుభాష్‌రెడ్డిలు పుష్కరస్నానమాచరించారు. ఈ సందర్భంగా పుష్కరాల కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి కార్యక్రమ నిర్వహకుడు దొర్భల రాజమౌళిశర్మ, సర్పంచి జానకిరాంరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆహ్వానం పలికారు. అనంతరం మంజీరా నదికి కుటుంబంతో వెళ్లిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి వేదమంత్రాల మద్య పుష్కర స్నానం ఆచరించారు. తరువాత ఎమ్మెల్సి కుటుంబసభ్యులు అమ్మవారి దర్శనం చేసుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా మీడియాతో మాట్లాడుతూ సరస్వతి విద్యా పీఠంవద్ద మంజీరా గరుడగంగా పుష్కరాలు ప్రారంభం కావడం ఆనందంగాఉందని, 12 సంవత్సరాల క్రితం ఇక్కడజరిగిన పుష్కరాలలో అప్పటి ఉద్యమ నాయకుడు కేసీఆర్ పాల్గొన్నారని తెలంగాణ వ్యాప్తంగా అన్ని నదుల పుష్కరాలను ప్రారంభించారని, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి గుర్తు చేశారు. వేద పురాణాలలో పేర్కొన్న విధంగా పుష్కర స్నానం ఆచరిస్తే మన పుర్వికులకు ముక్తిప్రసాదించబడుతుందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. పరిశుభ్రతను పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న ఎంపీవో ప్రశాంత్‌కు ఎమ్మెల్సీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సితో సర్పంచులు మహిపాల్, యామిరెడ్డి, నోముల శ్రీకాంత్, సాయా గౌడ్, శ్రీను నాయక్, ఎంపీటీసీ చిట్యాల శ్రీనివాస్, యువ నాయకులు ప్రశాంత్ తదితరులున్నారు.


మంజీరా పుష్కర స్నానాలను ప్రారంబించడానికి వస్తున్న మాదవనంద స్వామి, పుష్కర స్నానం చేస్తున్న ఎమ్మెల్సి దంపతులు